



బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: జిల్లా నూతన కలెక్టర్‌గా రాజర్షిషా బుధవారం బాధ్యతలను స్వీకరించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోను ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అధికారులు, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: నూతన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాను జిల్లా టీఎన్జీవోస్ కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్కను అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ మేరకు ఉద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, ఎ.నవీన్, తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడొద్దు : ఎఫ్ఆర్‌వో

ఉట్నూర్, మార్చి 6: బీర్సాయిపేట అటవీ రేంజ్ పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణులను వేటాడవద్దని బీర్సాయిపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ గులాం మోహినోద్దిన్ తెలిపారు. పంట చేలకు నష్టం కలిగిస్తున్నాయని కొందరు రైతులు కరెంట్ షాక్ పెట్టి వన్యప్రాణులను చంపాలని చూస్తున్నారని, అలాంటి రైతులకు అవగాహణ కల్పించడం జరిగిందన్నారు. అడవుల్లో చెట్లను నరికిన, కలప లింకు పాల్పడిన, అడవులకు నిప్పుపెట్టిన తెలంగాణ అటవీ చట్టం 1967, వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఏడేళ్ల కఠిన శిక్ష ఉంటుందని ఆయన హెచ్చరించారు.

బీఎల్ సంతోష్‌ను కలిసిన ఎంపీ సోయం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: బీజేపీ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఎల్ సంతోష్‌కుమార్‌ను బుధవారం ఎంపీ సోయం బాపురావు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ తొలి జాబితాలో టికెట్ దక్కకపోవడంపై బాపురావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించారు. ఆదివాసీలకే మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన బీఎల్ సంతోష్‌కుమార్ టికెట్‌పై స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం : ఏఎస్సై

తలమడుగు, మార్చి 6: ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై సురేంద్ర కోరారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలిక సాధికారత కార్యక్రమం చట్టాల అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాలికలకు ఉపయోగపడే చట్టాలు, ఇబ్బందులు ఎదురైనప్పుడు పోలీసు వారిని సంప్రదించడం, డయల్ 100, కొన్ని టోల్‌ఫ్రీ నెంబర్స్ గురించి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి జీవితం చాలా ముఖ్యమైనదని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.వెంకట్‌రావు, ఉపాధ్యాయులు సుమలత, లలిత, వెంకటేశ్వర్, వినోద్‌రెడ్డి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ టికెట్‌పై.. హై టెన్షన్

- జిల్లాలోని బీజేపీలో 42 మంది ఆశావహ నేతల క్యూ
- చివరకు ముగ్గురు నేతల మధ్యనే ప్రధాన పోటీ
- ఢిల్లీ అధిష్ఠానం పెద్దల వద్దకు ఉరుకులు పరుగులు
- కీలకంగా మారిన నలుగురు ఎమ్మెల్యేల మద్దతు
- కమలం పార్టీలో ఆసక్తి రేపుతున్న రాజకీయ పరిణామాలు





ఆదిలాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ ఆదిలాబాద్ పార్లమెంట్ సిట్టింగ్ టికెట్‌పై హై టెన్షన్ కొనసాగుతోంది. ఇప్పటికే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ప్రకటనను పెండింగ్‌లో పెట్టింది. దీంతో మళ్లీ టికెట్‌ను ఆశిస్తున్న సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. సోయంకు ఈసారి టికెట్ వస్తుందా? లేదా? అనే టాక్ సర్వత్రా వినిపిస్తోంది. సిట్టింగ్ ఎంపీ టికెట్‌ను ఎందుకు పెండింగ్‌లో పెట్టారన్న చర్చ జోరుగా సాగుతోంది. బీజేపీ టికెట్ కోసం 42 మంది ఆశావహ నేతలు అధిష్ఠానం వద్దకు క్యూ కడుతున్నారు. ఇటీవల జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటించినా.. ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించక పోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎన్నికల శంఖారావాన్ని పూరించి పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతున్నా.. ఎంపీ అభ్యర్థి ఎవరన్నది ఇంకా సస్పెన్షన్‌గానే మారింది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వుడు కావడంతో బీజేపీలో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ పక్కాప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. పార్లమెంట్ పరిధిలో మెజార్టీ వర్గాలైనా ఆదివాసీ, లంబాడా నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌లను బలంగా నమ్ముకుంటున్న జిల్లా నేతలు రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారే లాబీయింగ్ చేస్తున్నారు. తమ గాడ్‌ఫాదర్ల ద్వారా కేంద్ర అధిష్ఠానం పెద్దలపై ఒత్తిళ్లు చేస్తున్నారు. బుధవారం సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఢిల్లీలో జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఎల్ సంతోష్‌కుమార్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రోజురోజుకు కమలం పార్టీలో మారుతున్న రాజకీయ సమీకరణలు సర్వత్రా ఆసక్తి రేపుతున్నాయి.

డైలామాలో అధిష్ఠానం

ఇప్పటికే పలువురు నేతల గెలుపోటములను పరిశీలించిన కేంద్ర అధిష్ఠానం పలు రకాల సర్వేలను చేపట్టి ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. అభ్యర్థి ఎంపికకు తీవ్రమైన కసరత్తును చేస్తోంది. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ బాపురావుతో పాటు ఇతర నేతల అభ్యర్థిత్వంపై సీరియస్‌గా దృష్టి సారించింది. అయితే సోయం బాపురావుతో పాటు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేష్‌బాబుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఎవరికో ఒకరికి టికెట్ దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అయితే మాజీ ఎంపీ గోడం నగేష్ కూడా బీజేపీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నా.. టికెట్ హామీ ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. గత రెండు రోజుల క్రితమే నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేను కలిసినట్లు సమాచారం. బీజేపీలోని ఓ వర్గం మాజీ ఎంపీ నగేష్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీలో చేరకుండానే టికెట్ రావడం అంత సులువైనా పనేమీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదివాసీ నేత సిట్టింగ్ ఎంపీని కాదని ఇతరులకు అవకాశం ఇస్తే పార్టీపై ఆదివాసీల్లో కొంత వ్యతిరేకత వస్తుందనే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు చెబుతున్నారు.

హైదరాబాద్ టూ ఢిల్లీ టూర్

ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటన తర్వాత బీజేపీలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న నేతలంతా హుటాహుటిన అధిష్ఠానం పెద్దల వద్దకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. సిట్టింగ్ ఎంపీ సోయం ఢిల్లీకి వెళ్లి పలువురు అధిష్ఠానం పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై చర్చిస్తున్నారు. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబులు హైదరాబాద్‌లో మకాం వేశారు. వీరిద్దరు అధిష్ఠానం పిలుపు మేరకు ఢిల్లీకి వెళ్లే అవకాశాలు లేకపోలేదు. వీరితో పాటు మాజీ ఎంపీ గోడం నగేష్ కూడా ఓ ఎమ్మెల్యే సహకారంతో ఢిల్లీ పెద్దలను కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నా.. చివరికి టికెట్ లక్కు ఎవరికి కలిసి వస్తుందనే చర్చ జరుగుతోంది. నేతలంతా టికెట్‌పై ధీమాతోనే కనిపిస్తున్నా.. లోలోన మాత్రం ఏదో తెలియని భయం వెంటాడుతున్నట్లు తెలుస్తుంది. రెండవ జాబితాలో తనకే టికెట్ దక్కుతుందని ప్రకటించిన సోయం.. గత రెండు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి పార్టీలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తున్నారు.

రెండు వర్గాలుగా చీలిన ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గెలుపొందిన నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన పాయల శంకర్, హరీష్‌బాబులు ఓ వర్గం కాగా, నిర్మల్ జిల్లాకు చెందిన మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్‌లు మరో వర్గానికి నాయకత్వం వహిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఎంపీ అభ్యర్థి నిర్ణయంపై ఎమ్మెల్యేల మద్దతు కీలకంగా మారడంతో ప్రస్తుతం ఎమ్మెల్యేల చుట్టూ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న నేతలంతా చక్కర్లు కొడుతున్నారు. ఎమ్మెల్యేల మద్దతుతో టికెట్‌ను దక్కించుకునేందుకు పలురకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తమను సంప్రదిస్తున్నా.. అందరికీ జై అంటున్న ఎమ్మెల్యేలు చివరికి మద్దతు ఎవరికి ఇస్తారో? అంతుచిక్కడం లేదంటున్నారు. బీజేపీలో కొత్త నేతల సందడి పెరిగి పోవడంతో ఎవరికి వారే గాడ్‌ఫాదర్ల ద్వారా తమ రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నలుగురు ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయానికి రావడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి ఎమ్మెల్యేలు తలొగ్గక తప్పదన్న వాదనలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం

ఈవీఎంలపై అవగాహన

ఉట్నూర్, మార్చి 6: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉట్నూర్ మండల రెవెన్యూ అధికారులు బుధవారం మండలంలోని కన్నాపూర్‌లో గిరిజన ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమకు తోచిన వారికి ఓటు వేసేలా ఈవీఎంలపై అభ్యర్థుల గుర్తులు ఉంటాయని, నిర్భయంగా స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఇందులో రెవెన్యూ సిబ్బంది అనుష్, రామకృష్ణ, శంకర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాప్‌ల తనిఖీ

ఇచ్చోడ, మార్చి 6: మండలకేంద్రంలోని పలు మెడికల్ షాప్‌లను డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ దుకాణాలలో విక్రయించే మందులు, వాటి కాలపరిమితి, రికార్డులను, అనుమతి పత్రాలను పరిశీలించారు. గడువు ముగిసిన మందులు, నకిలీ మందులను మెడికల్‌లో అమ్మరాదని సూచించారు. అనంతరం మెడికల్ నిర్వాహకులకు పలు సూచనలను చేశారు.

'డీఎస్సీలో ఉర్దూ మీడియం అభ్యర్థులకు న్యాయం చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఉర్దూ మీడియం అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఉర్దూ మీడియం అభ్యర్థులు ధర్నా చేపట్టారు. కేవలం జిల్లాకు ఉర్దూ మీడియంలో మూడు పోస్టులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియంలో రిజర్వేషన్లను సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో అభ్యర్థులు ఫేరోజ్ అహ్మద్, అబ్రార్‌అహ్మద్, మహ్మద్ ఉమర్‌అహ్మద్, అబ్దుల్‌మునిబ్, ముజాహిద్, అబ్దుల్ మునీర్, జునేద్, సయ్యద్ సిరాజొద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

ఇచ్చోడ, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు ఆలంబనగా నిలిచేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని ఇచ్చోడ ఏడీఏ రాంకిషన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. ఆదర్శ రైతుల అనుభవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక రైతులతో కలిసి అధికారులు, నాయకులు ఆసక్తిగా తిలకించారు. ఇందులో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కైలాష్, ఇచ్చోడ, సిరికొండ మండలాల ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లుల అందజేత

తలమడుగు, మార్చి 6: మండలంలోని సకినాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లులను జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహజ్యోతి 200 యూనిట్లు ఉచిత కరెంట్ జీరో బిల్లు పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే, ఆరు గ్యారెంటీ స్కీంలను పకడ్బందీగా అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందులో ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, ఏఈ సతీష్, సబ్‌ఇంజినీర్ సాయి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



సమావేశంలో పాల్గొన్న అధికారులు

డాటాను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలి

- జిల్లా నూతన కలెక్టర్ రాజార్షిషా
- కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలు, నిర్వహణపై సమావేశం
- పాల్గొన్న జిల్లా అధికార యంత్రాంగం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు స్వీకరించి డాటాను సక్రమంగా తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన సేవా కేంద్రాలు, నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీవో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలలో ప్రజలు ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు స్వీకరించి డాటాను సక్రమంగా తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని తెలిపారు.ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తగినన్ని దరఖాస్తు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు కల్పించాలన్నారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పథకాల కోసం ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని, ఏవైనా తప్పులు నమోదైతే సరి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ప్రజాపాలన సేవా కేంద్రాల పట్ల అవగాహన కల్పించాలని,మిషన్ భగీరథ ద్వారా వేసవి లో నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని,అందుకు సంబంధిం చిన పనులు సత్వరమే ప్రారంభించాలన్నారు. ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని వారు మండలాల్లో పర్యటించి పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైని కలెక్టర్ వికాస్ మెహతో, తహసీల్దార్ ఎంపీడీవోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్‌లో నూతన కలెక్టర్ సుడిగాలి పర్యటన

జైనథ్: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజార్షిషా మొదటిరోజు బుధవారం మండలకేంద్రంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. హడలెత్తించిం ది. దీనిలో భాగంగా మండల కేంద్రంలో గల మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి ధరణి పోర్టల్ ద్వారా సేవలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని తనిఖీ చేసి వినియోగదారులకు కరెంట్, విద్యుత్, పలు అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ నాఫెడ్ ద్వారా జైనథ్ మార్కెట్ ఆవరణలో చేపడుతున్న సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులు నాయకులతో కలిసి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల న్నారు. ఈ కార్య క్రమంలో ట్రైనీ కలెక్టర్ వికాస్‌మమాత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బీజీఆర్, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఎంపీపీ గోవర్ధన్, మార్క్‌ఫెడ్ నాఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, మార్కెట్ కార్యదర్శి మధుకర్, సీఈవో గంగన్న, తదితరులు ఉన్నారు.



- జైనథ్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలిస్తూ..

రైతు నేస్తం కార్యక్రమాన్ని పరిశీలించిన రాజార్షిషా

జైనథ్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ బుధవారం సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించిన రైతు నేస్తాం కార్యక్రమాన్ని కలెక్టర్ రాజార్షిషా పరిశీలించారు. మండల కేంద్రంలో గల రైతువేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని స్థానిక అధికారులు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ పంటలను పండించే గంబీర్, తదితర రైతులను జిల్లా నూతన కలెక్టర్ రాజార్షి షా శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య మాట్లాడుతూ వ్యవసాయానికి సాంకేతికతను అనుసంధానం ద్వారా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 20,101 రైతు వేదికల్లో మొదటి విడతగా 101 రైతు వేదికల్లో ఈ ప్రక్రియను ప్రారంభించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్ని పథకాలు, పంటల బీమాతో పాటు ఇతర అంశాలపై దీని ద్వారా రైతులకు అవగాహన ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ట్రైనీ కలెక్టర్ వికాస్‌మెహతా, ఎంపీపీ ఎం.గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, తహసీల్దార్, మండల అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్



ఉట్నూర్ డిపోలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

మహిళలకు బీజేపీ పెద్దపీట : ఎమ్మెల్యే పాయల

- పలుచోట్ల మహిళా దినోత్సవ కార్యక్రమాలు

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 6: మహిళలను ఆధరించింది కేవలం బీజేపీ మాత్రమేనని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం శక్తివందన్ మహిళా స్వయం సహాయక సంఘాల సంపర్కాభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం మహిళలకు పెద్దపీట వేసింది బీజేపీ మాత్రమేనని అన్నారు. మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. వర్చువల్ విధానం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులతో ప్రధాని మోదీ మాట్లాడారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, రాష్ట్ర నాయకులు సుహాసినీరెడ్డి, చిల్కూరి జ్యోతిరెడ్డి, స్వప్న, సంధ్యారాణి, పద్మగౌడ్, అనితరేఖ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు తుడందెబ్బ ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు గోడం రేణుక అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె సభా కరపత్రాలను మహిళలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆమె ఈ సందర్భంగా పేరొన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉట్నూర్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఉట్నూర్ డిపోలో బుధవారం మహిళ ఉద్యోగులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ డిపో ఇన్‌చార్జీ మేనేజర్ కల్పన ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ హెచ్.రాజయ్య ఆధ్వర్యంలో మహిళా కండక్టర్లు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆర్టీసీ బస్సులలో ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికి మహిళా కండక్టర్లు ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్నారని మహిళ కండక్టర్ల నాయకురాలు ఉషాతాయి, సంగీత అన్నారు.ఈ సందర్భంగా ఉషాతాయి, సంగీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ కృష్ణ, వెంకటేశ్ ఆజాం, వంశీ, నారాయణ, మూర్తి, రవి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: దేశంలో మహిళా సంక్షేమమే బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపి జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయ కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో నారి శక్తి వందన్ అభినందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ, సాధికారత, మహిళా సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీజేపీ పాలన రాష్ట్రాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వాలు మహిళల హక్కులు, ప్రోత్సాహం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు ఎల్లవేళలా బీజేపీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డా.కేంద్రే లక్ష్మణ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శివ, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు భగవాన్, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పండి'

బోథ్, మార్చి 6: అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ చేతకాని హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా దోపిడీ చేసేందుకు సిద్ధమైందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత వరకు రైతులకు రైతుబంధు వేయలేదని, ఈ ప్రభుత్వానికి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేవలం మూడు ఎకరాల వరకు రైతు బంధు వేయడం జరిగిందని, రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. ఇందులో ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతంరెడ్డి, సజన్లాల్, జడ్పీటీసీలు సంధ్యారాణి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2 కనిష్ఠం 22.7






బీఆర్‌ఎస్ నేతల చూపు

» పార్టీ మారేందుకు ప్రణాళికలు » మొదలైన రహస్య సమావేశాలు » మారనున్న సమీకరణలు

నిర్మల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కారణంగా పూర్తిగా డీలా పడిపోయిన బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులతో పాటు కార్యకర్తలు సైతం తమ రాజకీయ భవిష్యత్తుపై మల్లగుల్లాలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండడం అలాగే బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవక తవకలపై విచారణ జరుపుతుండడంతో ఆ పార్టీ నాయకులంతా ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. ఇందులో భాగం గానే వారంతా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారన్న ప్రచారం మొదలైంది. జిల్లాలోని ఇద్దరు బీఆర్‌ఎస్ అగ్రనేతలతో పాటు మరికొంతమంది ప్రజా ప్రతినిధులు పార్టీ మారబోతున్నారన్న ఊహాగానాలు ఊపందు కుంటున్నాయి. ముఖ్యంగా వీరంతా జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో గత కొద్దిరోజుల నుంచి సంప్రదింపులు జరుపుతున్నారన్న వాదనలు తెరపైకి వస్తున్నాయి. స్థానికంగా ఎలాంటి ప్రతికూలత ఎదురు కాకుండా వీరంతా ముందస్తుగా జిల్లా కాంగ్రెస్ నేతలతో చర్చలు జరిపారని చెబుతున్నారు. అయితే ఇద్దరు అగ్రనేతలు మాత్రం రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలతో చర్చలు జరి ... పారని అయితే ఆ నేతలు మాత్రం జిల్లా నాయకులతో మొదట ... ంచాలన్న ప్రతి ... చేశారని



పేర్కొంటున్నారు. అయితే ఈ ఇద్దరు అ గ్రనేతలు మాత్రం పార్టీ మార్పు విష యంలో స్పష్టమైన వివరణ ఇవ్వకపోతు న్నప్పటికీ పరోక్ష సంకేతాలు మాత్రం ఇస్తున్నారంటున్నారు. తమను కలుస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో వీరిద్దరూ పార్టీ మార్పుపై వస్తున్న ఊహాగానాల విషయంలో ఖండించక పోతుండడం అనుమానాలకు తావిస్తోంది. అయితే కాంగ్రెస్‌లో చేరే అంశాన్ని ఈ నాయకులు వ్యూహాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. మొదట ఒక్కో నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు వారితో పాటు కార్యకర్తలు బృందాలుగా విడిపోయి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. అయితే మొదట కేడరంతా కాంగ్రెస్‌లో చేరిన తర్వాత జిల్లాకు చెందిన అగ్రనేత కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు చెబుతున్నారు. సదరు అగ్రనేతకు సంబంధించిన సన్నిహిత వర్గాలు సైతం ఈ అంశాన్ని పరోక్షంగా ధ్రువీకరిస్తున్నాయి. కాంగ్రెస్‌లోని రాష్ట్రస్థాయి పెద్దలతో ఉన్న సంబంధాల కారణంగా సదరు నేత ఆ పార్టీలో చేరేందుకు పావులు కదుపుతున్నారని అంటున్నారు.

ఇటీవల జరిగిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, సారంగాపూర్ ఎంపీపీ అవిశ్వాస తీర్మానాల సమయంలో ఈ నేత అనుసరించిన వ్యూహాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్న బీఆర్‌ఎస్ నేతలంతా చేరికల విషయంలో చర్చ జరిగేట్లు పావులు కదుపుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలు, కేడర్ మధ్య సమన్వయం పూర్తిగా లోపిం చిందని అంటున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో ఓటమికి సంబంధించి పూర్తి సమీక్ష కూడా జరగకపోవడం ఆ పార్టీలో చర్చకు తావిస్తోంది. ప్రస్తుతం పార్టీ నేతలు కార్యకర్తలు అంతా ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా మారిందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో చాలా మంది సీనియర్ నేతలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండడం ఇక్కడి రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చేరికల వ్యవహారం అమలైతే జిల్లాలో భారీగా రాజకీయ సమీకరణాలు జరగనున్నట్లు చెబుతున్నారు.

లోక్ సభ ఎన్నికకు ముందా.. తర్వాతా ?

కాగా చేరికల విషయంలో లోక్ సభ ఎన్నికలకు ముందుగానా లేక ఎన్నికల తర్వాతనా అనే అంశాన్ని బీఆర్‌ఎస్ నేతలు తేల్చుకోలేక పోతున్నారంటున్నారు. స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి అలాగే అధిష్ఠానం నుండి చేరికల విషయంలో గ్రీన్‌సిగ్నల్ లభిస్తున్నప్పటికీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుంటామంటూ ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయోనన్న అంశంపై వీరంతా బేరీజు వేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల కన్నా ముందుగానే కాంగ్రెస్‌లో చేరినట్లయితే మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంటుందంటూ కూడా మరికొంతమంది ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారంటున్నారు. మొత్తానికి రాబోయే లోక్‌సభ ఎన్నికల వరకు బీఆర్‌ఎస్ నేతలు తమ చేరికల వ్యూహంపై క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

రాష్ట్రస్థాయిలో మంతనాలు

కాగా స్థానిక, రాష్ట్రస్థాయిలో జరుగుతున్న రాజకీయ పరిణామాల ఆధారంగా ఈ పార్టీ ఫిరాయింపుల పర్వం కొనసాగే అవకాశం ఉందంటున్నారు. మారుతేన్న రాజకీయ పరిణామాలను సాకుగా చూపుతూ బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు జిల్లా నేతలంతా తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్. ప్రవీణ్ కుమార్ బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తు కుదుర్చుకున్న కారణంగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్న వ్యవహారం ప్రస్తుతం జరుగుతున్న ఉహాగానాలకు బలం చేకూరుస్తోందని అంటున్నారు. రోజు రోజుకు మారుతున్న సమీకరణలను ఆధారంగా చేసుకొని జిల్లాకు చెందిన అగ్రనేతలతో పాటు స్థానిక నేతలు, సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీని వీడేందుకు పావులు కదుపుతున్నారంటున్నారు. కొద్ది రోజుల్లో ఈ పార్టీ ఫిరాయింపుల పర్వం పతాకస్థాయికి చేరుకునే అవకాశాలు లేకపోలేదంటున్నారు.

బాసర ఆలయంలో ఆడిట్ బృందం తనిఖీలు



బాసర అమ్మవారి ఆలయం

బాసర, మార్చి, 6: బాసర సరస్వతీ దేవస్థానంలో బుధవారం ఆడిట్ అధికారుల బృందం తనిఖీలు ప్రారంభించింది. రాష్ట్రస్థాయి అధికారులు దేవస్థానంలోని రికార్డులను పరిశీలిస్తున్నారు. దాదాపు 10 రోజుల పాటు ఈ ఆడిటింగ్ జరగనుంది. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు దేవస్థానంలో జరిగిన చెల్లింపులు, ఇతర లెక్కలను పరిశీలించనున్నారు. నిబంధనల మేరకు జరుగుతున్నాయా లేదా అనే విషయం ఆడిట్‌లో బయటపడనుంది. గత కొన్నేళ్లుగా దేవస్థానంలో వివిధ ఖర్చులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ప్రతియేటా భక్తులు సమర్పించిన రూ.కోట్ల నిధులు పక్కదారి పడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొన్ని రోజుల క్రిందట స్థానికులు దేవస్థానంలో నిధుల దుర్వినియోగం విషయమై హైకోర్టు మెట్లెక్కారు. దేవాదాయ శాఖ రాష్ట్ర అధికారులు కూడా గడిచిన నాలుగేళ్లలో ఒకటి, రెండు సార్లు విచారణ చేపట్టారు. అనే లావాదేవీలు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు మాత్ర శాఖనే తేల్చింది. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి అధికారుల బృందం చేపట్టిన ఈ ఆడిటింగ్‌లో ఎలాంటి లోపాలు, అక్రమాలు వెలుగుచూస్తాయో చూడాలి. ప్రస్తుతం ఆలయ ఈవో సెలవుపై వెళ్లారు. ఆదిలాబాద్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జీగా ఉన్నారు.

శివరాత్రికి వేములవాడకు 30 ప్రత్యేక బస్సులు

• డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్ కల్చరల్, మార్చి 6 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడకు నేటి నుంచి 30 ప్రత్యేకబస్సులు నడిపించనున్నట్లు నిర్మల్ ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దవారికి 220, పిల్లలకు 120 రూపాయల ఛార్జ్ ఉంటుందన్నారు. శివరాత్రి నాడు నిర్మల్ సమీపంలోని ప్రముఖ శివక్షేత్రాలైన కదిలి, బూరుగుపల్లి, కాల్వ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశం వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

ఓలాలో ముగిసిన ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

కుంటాల, మార్చి, 6 : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో గల విఠల రుక్మాబాయి ఆలయ వార్షికోత్సవం గత మూడు రోజులుగా అంగరంగవైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆఖరి రోజైన బుధవారం స్వస్తి వచనము, రుక్మిణి పాండురంగ ఆరాధన పూజ, హోమము, మహాహారతి, పూర్ణాహుతి, దేవతా విసర్జనము, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆఖరి రోజు బుధవారం నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ బిగాల గణేష్‌గుప్తా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.



ఎల్‌ఆర్‌ఎస్ వ్యతిరేకిస్తే మానవహారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్‌ఆర్‌ఎస్ వ్యతిరేకిస్తూ నిర్మల్‌లో బీఆర్‌ఎస్ ధర్నా

నిర్మల్ కల్చరల్, మార్చి 6 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి డబ్బులు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. ఎల్‌ఆర్ ఎస్ పేరుతో 20 వేల కోట్ల రూపాయలు వసూలు చేసి కాంగ్రెస్ పార్టీ దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు. నాడు ఎల్‌ఆర్‌ఎస్ వ్యతిరేకించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చిందన్నారు. 25 లక్షల కుంటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు వసూలు చేసే ఆలోచన మానుకొని ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేసే వరకు ప్రజల తరుపున పోరాడు తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, ధర్మాజీ రాజేందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

• 20 వేల కోట్ల దోపిడీ కోసమే కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్ తెచ్చింది

• బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

ఖానాపూర్, మార్చి 6 : ఎల్‌ఆర్‌ఎస్‌ను వెంటనే రద్దు చేయాలని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో నిరసన కార్యక్రమం చేపాట్టరు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌లో నిర్మల్, ఖానాపూర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ... 20 వేల కోట్ల దోపిడీ లక్ష్యంగా కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్‌ను తెచ్చిందన్నారు. ఆనాడు తాము అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ ఉండదని చెప్పిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. వెంటనే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, బీఆర్‌ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ రామునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, మండల అధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న, జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, బూసి నరేందర్, బలగం రమేష్, అడిదెల మహేందర్, గౌరీకర్ రాజు, తదితరులున్నారు.

ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 6 : మహిళా స్వయం సహాయక సంఘాలకు, ఎన్‌జీవో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఈడియో ప్రసంగాన్ని పార్టీ నాయకులు వీక్షించారు. ఆర్‌కే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాధం అరవింద్, తదితర సీనియర్ నాయకులు వీక్షించిన వారిలో ఉన్నారు.

మహిళల సర్వతోముఖాభివృద్ధియే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

భైంసా, మార్చి 6 : ప్రధానిమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళల సర్వతోముఖాభివృద్ధియే ధ్యేయంగా పెట్టుకొని అందుకు అనుగుణంగా పాటుపడుతోందని బీజేపీ ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ పేర్కొన్నారు. బుధవారం భైంసాలోని గణేష్‌నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారి శక్తి వందన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రయోజనాలు, ఫలితాలను వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లోనే ప్రావీణ్యతను పెంపొందించుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రధానిమోదీ నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం ద్వారా సమావేశానికి హజరైన సభ్యులకు వీక్షింపచేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు రావుల సువర్ణ, అనిత బాలాజీ సూత్రావే, అల్లెం లక్ష్మీ, భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్; పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేష్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను జోడించడమే 'రైతు నేస్తం' లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కడెంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఖానాపూర్, మార్చి 6 : ఆధునిక సాంకేతికతను సాగురంగానికి అనుసంధానం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని కడెం మండల కేంద్రంలోని రైతువేదికలో వర్చువల్ విధానంలో రైతులకు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తదితరుల సందేశాలను రైతులు అనుభవాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో కలిసి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులు వీక్షించారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు అధునాతన సాగు పద్ధతులతో పాటు లాభసాటి వ్యవసాయంపై ప్రభుత్వం అవగాహన కల్పిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలకు బీమా వర్తింపజేయాలనే సాహాసోపేతమైన నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వమే పంటలన్నింటికీ బీమా ప్రీమియం పూర్తిగా భరిస్తుందన్నారు. వచ్చే వానాకలం సీజన్ నుండి పంటల బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకొని ప్రతి రైతు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, పలువురు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోంది

లక్ష్మణచాంద, మార్చి 6 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి బుధవారం అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో రూ. 13.50 లక్షల పీఎంఎస్ హెచ్ ఆర్ఐ నిధులతో బుధవారం సైన్స్ ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశల వారీగా 2.50 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులచే బోధన కార్యక్రమాలు చేపడుతున్నారని, వీరి ద్వారా నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. ఉపాధ్యాయ శిక్షణ పొంది కాంపిటీటివ్ పరీక్షలలో ఉన్నతమైన ర్యాంకు సాధించి ఉద్యోగాలు పొందిన టాలెంటెడ్ ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించబడుతుందని, ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత ఈ కార్యక్రమానికి వచ్చిన మహేశ్వర్ రెడ్డిని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డీఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే మహనీయుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అని డీఈవో రవీందర్‌రెడ్డి కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుతారని, వారికి నాణ్యమైన విద్య అందించాలని పదే పదే నాకు గుర్తు చేస్తూ ఉంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం శతవిధాల నేను కృషి చేస్తానని మహేశ్వర్‌రెడ్డి అన్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, పంచాయతీ రాజ్ డీఈ రాజేందర్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాంప్రసాద్, స్థానిక ఎంపీటీసీ గడ్డం నర్సారెడ్డి, నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, అడ్వాల రమేష్, కమల్‌కోట వెంకట్‌రెడ్డి, అడిచెర్ల రవికుమార్, అయిండ్ల శ్రీధర్‌రెడ్డి, వేణు గౌడ్, అయిండ్ల భీమ్‌రెడ్డి, లక్ష్మణ్, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జుంజురు స్వప్న, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను మెరుగుపరుస్తా

సారంగాపూర్, మార్చి 6 : విద్యావ్యవస్థను మెరుగు పరుస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ప్రయోగశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేయడంతో పాటు మైనారిటీ గురుకుల పాఠశాలలో సీసీ, డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేసి ఈ సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోలేదన్నారు. సైన్స్ ప్రయోగశాల కోసం రూ. 13 లక్షల 50 వేల నిధులు మంజూరు కావడంతో పాటు మైనారిటీ గురుకుల పాఠశాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 50 లక్షలు మంజూరయ్యాయని వాటి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీటీసీ పద్మ వీరయ్య, నాయకులు వడ్డే రాజేందర్ రెడ్డి, రాంశంకర్ రెడ్డి, చంద్రప్రకాష్ గౌడ్, విలాస్, గంగారెడ్డి, సాహెబ్ రావు, భీమలింగంలతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఉన్నారు.



లక్ష్మణచాందలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

బాట్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, మార్చి 6 :జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాట్మింటన్ ఇండోర్ స్టేడియంను బుధవారం ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్యాట్మింటన్ ఆడారు. నాయకులు ఆయన వెంట పాల్గొన్నారు.

కదిలి పాపహరేశ్వరాలయంలో నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

దిలావర్‌పూర్, మార్చి 6 : కోరిన వారి కొంగు బంగారమై భక్తుల పూజలందుకుంటున్న శ్రీ మాతాన్నపూర్ణ కదిలి పాప హరేశ్వరాలయం మహాశివరాత్రికి జాతరకు ముస్తాబైంది. గురువారం సాయంత్రం పాపహరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను మండలంలోని సాంగ్వికి తరలిస్తారు. అక్కడ రాత్రి బస చేసి శుక్రవారం తెల్లవారు జామున సమీపంలో పవిత్ర గోదావరి నదీమ తల్లి చెంతకు తీసుకెళ్తారు. గోదావరి జలాలతో శుద్ధి చేసి తిరిగి కదిలికి చేర్చడంతో జాతర ప్రారంభమవుతుంది.

భైంసా పట్టణంలోని ఆలయాల్లో..

భైంసా, మార్చి 6 : పట్టణంలో కిసాన్‌గల్లిలోని మహాదేవ్ మందిరం, పురణాబజార్ ప్రాంతంలోని పాతలేశ్వర్, ఓంకారేశ్వర్ శివాలయాలు ఉత్సవాలకు కొరకు గాను ముస్తాబు అయ్యాయి. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహణ కమిటీ సభ్యులు ఆలయాలను సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు.

గృహజ్యోతి పథకం ప్రారంభం

తానూర్ , మార్చి 6 : మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిదాస్ మధు పటేల్ గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనాయకులు నరేష్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొయ్య బొమ్మలను సందర్శించిన విద్యార్థులు

నిర్మల్ షైన్‌గేట్, మార్చి 6 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం నిర్మల్‌లోని కొయ్య బొమ్మల పరిశ్రమను సందర్శించారు. బొమ్మలు ఎలా తయారు చేస్తున్నారో తెలుసుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ అతిక్ బేగం, ఆఫ్రిన్, సన, సాదియా, నుస్రత్, మున్నవార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు పీఆర్టీయూ ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, మార్చి 6 : నిర్మల్ జిల్లా పీఆర్టీయూశాఖ గురువారం సాయంత్రం 4 గంటలకు పెన్షనర్ల సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, సర్వశిక్షా అభియాన్, సీపీఎస్ ఉద్యోగులు హాజరుకావాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒడ్నాల రవిరాజు, సిరికొండ శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో కోరారు. రాష్ట్ర నాయకులు ఉమాకర్‌రెడ్డి, పి.సత్యనారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నర్సాపూర్(జి), మార్చి 6 : మండలంలోని బామ్ని(బి) గ్రామంలో బుధవారం చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బామ్ని(బి) గ్రామానికి చెందిన చాతల హన్మంతు(31) గ్రామం పక్కన గల పాత చెరువులో చేపలు పట్టడానికి వెళ్ళి ఈత రాక ప్రమాదవశాత్తు చెరువులో పడటంతో ప్రక్కనే బట్టలు ఉతకడానికి వచ్చిన కళ్యాణి గమనించి స్థానికులకు సమాచారం అందించింది. ఆటోలో వైద్యం కొరకు తరలిస్తుండగా నందన్ వద్దకు రాగానే 108 వాహనంలో ఎక్కించి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించడంతో భార్య చాతల గంగసాగర పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎం.హన్మాండ్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కుంటాల, మార్చి, 6 : కుంటాల మండలంలోని కల్లూరు - కుంటాల రహదారిపై అందకూర్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ రజనీకాంత్ తెలిపారు. ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతి పత్రాలు లారీ డ్రైవర్ వద్ద లేనందున తహ సీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు లారీని అప్పజెప్పడం జరిగిందన్నారు. కాగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీకి తహసీల్దార్ బుధవారం రూ. 50 వేల జరిమానా విధించారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన హన్మాండ్లు

నర్సాపూర్(జి), మార్చి 6 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎస్సై గా బుధవారం ఎం. హన్మాండ్లు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రవీందర్ బదిలీపై కుబీర్ పోలీస్‌స్టేషన్ వెళ్ళగా, పెంబి పోలీస్‌స్టేషన్ నుండి ఎం.హన్మాండ్లు బదిలీపై నర్సాపూర్ (జి) వచ్చారు.

సారంగాపూర్ ఎస్సైగా చంద్రమోహన్

సారంగాపూర్, మార్చి 6 : సారంగాపూర్ మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించిన కృష్ణ సాగర్ రెడ్డి కడెం మండలానికి బదిలీపై వెళ్లడంతో సారంగాపూర్ ఎస్సైగా చంద్రమోహన్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు.